# సువార్త ప్రకటన

## (Evangelism)

**పాఠ్యోద్దేశం** : ఈ పాఠ్యక్రమంలో ఐదవ భాగంలోని సందేశం దేవుని రాజ్య సువార్త అనీ, యేసు యొక్క సమాధానపరచు పరిచర్య కొనసాగింపబడటానికి సంఘం ఈ సందేశాన్ని బోధించాలనీ చూపించటం. ఆలాగే, సువార్త ప్రకటన చేయాలనే మనస్సు సంఘం యొక్క పరిశుద్ధతకు ఎట్లు సహకరిస్తుందో చూపించుట.

## ఉపోద్ఘాతం

*ఇది మంచిదియు మన రక్షకుడగు దేవుని దృష్టికి అనుకూలమైనదియునై యున్నది. ఆయన, మనుష్యులందరు రక్షణపొంది సత్యమునుగూర్చిన అనుభవజ్ఞానముగలవారై యుండవలెనని యిచ్ఛయించుచున్నాడు. 1 తిమోతి. 2:3,4*

*కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడు గాని యెవడునునశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారు మనస్సు పొందవలెనని కోరుచు, మీయెడల దీర్ఘశాంతము గలవాడైయున్నాడు. 2 పేతురు 3:9*

దేవుని రాజ్యంలో కుమారులుగా ఉండటం కోసం భూమి మీదనున్న మానవు లంతా రక్షింపబడాలని దేవుడు కోరుకొంటున్నాడు కాబట్టి, రాజ్యాన్ని పాలించే అధికారం యేసు పొంది నప్పుడు, సర్వలోకానికి వెళ్లి సమస్త జనులను శిష్యులుగా చేయాలనితన శిష్యులకు ఆజ్ఞాపించటం జరిగింది. గొప్పఆజ్ఞ (Great Commission) అని సామాన్యంగా చెప్పబడే ఈ మహా ఆదేశాన్ని ఇచ్చినప్పుడు యేసు తన పదకొండుమంది శిష్యులతోనే మాట్లాడినారు. అయితే, "నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో, వాటినన్నిటినీ గైకొనవలెనని వారికి బోధించుడి" అని యేసు చెప్పి, అపొస్తులులతో పాటు సంఘం కూడా ఈ గొప్ప ఆజ్ఞను పొందటం జరుగుతుందని బయలుపరిచినారు. అందుకే, మనరాజైన యేసు క్రైస్తవులమైన మనకు ఈ క్రింది ఆదేశాన్ని అనుగ్రహించారు.

*అయితే యేసు వారియొద్దకు వచ్చి పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధి కారము ఇయ్యబడియున్నది. కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి తండ్రి యొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి, ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతోకూడ ఉన్నానని వారితో చెప్పెను. మత్తయి 28:18-20*

రాజైన యేసు తన లక్ష్యసాధన కోసం **భౌగోళిక పరమైన ఒక పథకాన్ని** అపొస్తులులకు అను గ్రహించారు. అది ఈ క్రింది లేఖనంలో వుంది.

*అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తినొందెదరు గనుక మీరు యెరూషలేము లోను, యూదయ, సమరయ దేశములయందంతటను భూదిగంత ములవరకును, నాకు సాక్షులై యుందురని వారితో చెప్పెను. అపొ. కార్య. 1:8*

సువార్త ప్రకటన నిమిత్తం రోమా పట్టణంలోని క్రీస్తు సంఘానికి అపొస్తలుడైన పౌలు ఒక **క్రమపద్ధతిని** ప్రకటించాడు. అది ఈ క్రింది లేఖనంలో వుంది.

*ఎందుకనగా ప్రభువు నామమునుబట్టి ప్రార్థనచేయు వాడెవడో వాడు రక్షింపబడును. వారు విశ్వసింపనివానికి ఎట్లు ప్రార్థన చేయుదురు? విననివానిని ఎట్లు విశ్వసించుదురు? ప్రకటించువారు పంపబడని యెడల ఎట్లు ప్రకటించుదురు? ఇందువిషయమై ఉత్తమమైన వాటినిగూర్చిన సువార్త ప్రకటించువారి పాదములెంతో సుందరమైనవి అని వ్రాయబడియున్నది. రోమా. 10:13-15*

సువార్త ప్రకటనను మనం ఎక్కడ ఆరంభించాలో, ఎక్కడ ముగించాలో సువార్త ప్రకటన ఆమలు జరపబడే పద్ధతి మొదలగు విషయాలను ఈ పైలేఖనాలు మనకు తెలియజేస్తున్నాయి. సువార్త ప్రకటనను మనం నివసిస్తున్న పట్టణంలో ప్రారంభించి, ఆ పట్టణాన్ని అంతటినీ సువార్త ప్రకటనతో నింపి, దాని పరిసర ప్రాంతాలు సంచరించి, చివరికి భూదిగంతాలలోని విదేశాలకు వెళతాము. సంఘమంతా వెళ్లలేకపోవటం, కొందరు తమ సొంత పట్టణాలలో ప్రకటించలేకపోవటం అనేవి సుస్పష్టం. కాబట్టి, సువార్త ప్రకటించటానికి సామర్థ్యం సంపాదించుకొని, ఈ పనికి ఇష్టపడే వారిని సంఘం పంపించాలి. సువార్తనుకొందరువిని, విశ్వసించి, విధేయులైన విశ్వాసుల కోసం దేవుడు ఏర్పాటు చేసిన విధానం ప్రకారంగా వారు రక్షింపబడాలని మనం దేవునికి ప్రార్థించాలి. ప్రభువు ఏర్పాటు చేసిన సువార్త ప్రకటన పద్ధతి క్రమం ప్రకారం, సంఘం సువార్తికులను పంపటానికీ, మరియు దేవుడు మనుష్యులను రక్షించటానికి మధ్య ఉండే పరస్పర సంబంధాన్ని దయతో గమనించండి.

సమస్త జనులను శిష్యులుగా చేయాలనే మన ప్రభువు యొక్క ఆజ్ఞ మరియు సువార్తికులను పంపించే పద్ధతి క్రమం అనే వాటిని కలిగివున్న మనకు ఇక ఒక్కటే ప్రశ్న వుంది. మనం దేనిని ప్రకటించాలి? అనేదే ఆప్రశ్న. మనం దేనిని ప్రకటించాలో ఈ పాఠంలో చర్చించబడుతుంది: "దైవికరాజును కలిగివున్న మానవవిశేషకమైన దేవుని రాజ్యము" అని పేరుపెట్టబడిన ఈ ఐదవభాగంలో మనం ఇంతవరకు నేర్చుకొనిన పాఠాలను మొత్తముగా కలిపిచెప్పటం ఈ చర్చలో వుంటుంది.

యేసు అమలు జరుపుచున్న సమాధాన ప్రణాళికలో నాలుగు ముఖ్యభాగాలు ఉన్నట్లు ఈభాగం ఉపోద్ఘాతంలో మనం నేర్చుకొన్నాము. దయచేసి, ఈభాగం ఉపోద్ఘాతాన్ని మరలా చదవండి. లోకానికి సువార్తప్రకటించటం, లోకంలోనుండి మనుష్యులను పిలిచి "క్రీస్తునందు కూర్చోబెట్టటం," పరిశుద్ధపరచబడు విధానంద్వారా మనుష్యులను దేవునితో సమాధానపరచటం,

మరియు విశ్వాసులైన క్రైస్తవులకు పునరుత్థానంలో మహిమ శరీరాలు, తీర్పులో బహుమానాలు ఇవ్వటం అనేవి ఆ నాల్గు భాగాలు. దేవుని రాజ్యాన్ని ప్రకటించటం ద్వారా సమాధానపరచు పరిచర్యను ఆరంభించటానికి యేసు సంఘం మీద ఆధారపడినారని ఈపాఠంలో చూస్తాము. అలాగే, మనం సువార్త ప్రకటన చేయటం మన ఆత్మీయ పెరుగుదలకు ఎట్లు దోహదం చేస్తుందో చూస్తాము.

## పాఠం

దేవుని రాజ్యవిస్తరణ కోసం యేసు తలపెట్టిన సువార్తదండయాత్రను ప్రారంభించ టానికి ఆయన ఆరోహణుడై తిరిగి పరలోకం వెళ్లేంతవరకూ వేచియుండలేదు. ఆయన భూలోకంలో జీవించినకాలంలోనే ఇశ్రాయేలు పట్టణాలలో దేవునిరాజ్యాన్ని ప్రకటించారు. పరలోకంనుండి ఆయన పంపబడిన కారణాలలో ఇది కూడా ఒక కారణం. “నేను ఇతరపట్టణములలోను దేవుని రాజ్య సువార్తను ప్రకటింపవలెను. ఇందు నిమిత్తమే నేను పంపబడితినని” యేసు చెప్పెను. (లూకా 4:43). దేవుని రాజ్యం ఎల్లప్పుడూ ఉండినట్టి ఒక వాస్తవం. అందువలన దేవుని రాజ్య స్థాపన అనేది సువార్తగా అగుపించదు. యేసు భూలోకంలో జీవించివున్నప్పుడుగానీ, ఆయన పరలోకంతిరిగి వెళ్లినప్పటి నుండిగానీ ప్రకటింపబడిన ప్రత్యేక సువార్త ఏదంటే, యేసు యొక్క రాచరికం, యాజకత్వం మరియు వ్యక్తిగత బలియాగం. దేవుని రాజ్యంలోని ఇతరవిశేషాలు మానవాళికి అందుబాటులో ఉండటానికి సువార్తలోని ఈ అంశాలు కారణమయ్యాయి. యేసు చెప్పినట్లు, సువార్త ప్రకటన బాప్తిస్మమిచ్చు యోహానుతోనే నిజంగా ఆరంభమైంది. ఈ క్రింది లేఖనం ఆలోచించండి.

> *యోహాను కాలమువరకు ధర్మశాస్త్రమును ప్రవక్తలును ఉండిరి అప్పటి నుండి దేవుని రాజ్య సువార్త ప్రకటింపబడుచున్నది ప్రతివాడును ఆ రాజ్యములో బలవంతముగా జొరబడుచున్నాడు.*
>
> *లూకా 16:16*

దేవుని రాజ్యం సమీపించినది అని యోహాను ప్రకటించాడు. పరిశుద్ధాత్మలోను అగ్నిలోను యేసు బాప్తిస్మమిస్తారని కూడా అతడు చెప్పాడు (మత్తయి 3:2,11). పండ్రెండు మంది అపొస్తలులు కూడా ఇదే సందేశంతో ఇశ్రాయేలీయులలో నశించిన గొఱ్ఱెల యొద్దకు పంపబడ్డారు. “పాముల వలె వివేకులును, పావురముల వలె నిష్కపటులునై ఉండాలని” యేసు వారికి చెప్పటం కూడా జరిగింది (మత్తయి 10:16). ఆయన ఈ క్రింది రెండువచనాలలోని సంగతులను కూడా వారితో చెప్పారు.

> *“చీకటిలో నేను మీతో చెప్పునది మీరు వెలుగులో చెప్పుడి చెవిలో మీకు చెప్పబడినది మేడలమీద ప్రకటించుడి. మరియు ఈ రాజ్యసువార్త సకల జనములకు సాక్ష్యార్థమై లోకమందంతటను ప్రకటింపబడును; అటుతరువాత అంతము వచ్చును.* *మత్తయి 10:27; 24:14*

యేసు చెప్పిన ఉపమానాలలో దేవుని రాజ్యానికి సంబంధించిన భావనలను పెక్కింటిని ఆయన బోధించటం జరిగింది (మత్తయి 13:10-17). దేవుని రాజ్యాన్ని పాలించటానికి ఆయన వచ్చినట్లును, యూదులు ఆయనను చంపుతారనియు చూపించటానికి యేసు ఉపమానములను వినియోగించుకున్నారు (మత్తయి 21:33-46). అపొస్తలుల కార్యాలు రెండవ అధ్యాయంలో వ్రాయబడినట్లు, పెంతెకొస్తు దినమందు పేతురు పదునొకండు మందితో కూడా లేచి ఈ సంగతులు సంభవించి నాయని ప్రకటించాడు. పెంతెకొస్తు దినానికి ముందును, దానికి తరువాతను దేవుని రాజ్యసువార్త సందేశంలోని ఏకైక వ్యత్యాసం ఏదంటే. అంతవరకు ప్రకటింపబడిన సందేశంలోని అసలు విషయం చరిత్రాత్మకమైన ఒక వాస్తవం కావటమే. యేసును రాజుగా, యాజకునిగా, పాప పరిహారార్థబలిగా చూపిస్తూ దేవుని రాజ్యాన్ని ప్రకటించటానికి పరిశుద్ధాత్మ అపొస్తలులను, ఇతరులను నడిపించటం జరిగింది.

మానవులు పొందటానికి అంతవరకూ అందుబాటులోలేని అనేకమైన కృపలను ఈ నూతన దీవెనలు సాధ్యం చేశాయి. ఉదాహరణకు, దేవుని పిల్లలగుటకు క్రైస్తవులకు అధికారం ఇయ్య బడింది (యోహాను 1:12). అలాగే, క్రొత్తనిబంధన, ఎంతో వ్యక్తి గతమైన రీతిలో పరిశుద్ధాత్ముని సహవాసం మనకున్నాయి (అపొ. కార్య. 5:32; హెబ్రీ. 8:6-12). మరొక మాటలో, ఇప్పుడు క్రైస్తవులకు మానవాళి కొరకైన దేవుని ఉద్దేశాలను గూర్చిన సత్యము తెలుసు గనుక వారు ఆ సత్యాన్ని ప్రకటించగలరు. అయితే వారు యేసుక్రీస్తు ద్వారా దేవుని కృపలను ప్రకటించగలరు. క్రైస్తవుల కోసం దేవుని ఉద్దేశాలు వాస్తవమగునట్లు ఈ కృపలు సాధ్యపరచును; కాబట్టి, మనం అదే నిత్య రాజ్యమును గూర్చి మరియు క్రీస్తునందున్న ఆత్మీయ ఆశీర్వాదము లన్నిటిని గూర్చి ప్రకటిస్తున్నాము. దేవుని ఉద్దేశాలను మరియు దేవుని కృపలను వేర్వేరుగా చూపించే విషయంలో మనం జాగ్రత్త కలిగియుండాలి. క్రైస్తవ్యానికి సిలువ అనేది సరిపడిన ఒక గుర్తు కాదు. ఇది పలు లేఖనాలలో దేవుని కృపలతోను మరియు శ్రమల ద్వారా క్రమశిక్షణ అనే దృక్పథంతోను దేవుని కుమారులను వృద్ధి పరచడానికి వాడబడింది. మత్తయి 10:38; 1 కొరింథీ. 1:17,18; గలతీ. 6:12. అయిననూ, సిలువ దేవుని రాజ్యమును గాని ఆయన రాజ్యంలో మానవాళి కొరకైన దేవుని ఉద్దేశాలను గాని చూపించదు.

అపొస్తలుల కార్యముల గ్రంథాన్ని త్వరితంగానే చూచినా మనకో విషయం బయలు పడుతుంది. అదేమంటే, అపొస్తలులు తమ సువార్త ప్రకటన కార్యక్రమంలో ప్రకటించిన సందేశం దేవుని రాజ్యమే (అపొ. కార్య. 8:12, 19:8, 20:27, 28:30, 31). వారు బోధించిన రాజ్యం క్రొత్తదేమీ కాదుగానీ వారు దేవునిరాజ్యాన్ని పాలించేరాజు క్రొత్తవాడని ప్రకటించారు. సువార్తలలో యేసు ప్రకటించిన జీవ నియమములన్నీ (జోయే -ZOE) వారు బోధించారు. మృతుల పునరుత్థానం వారు ప్రకటించిన సందేశంలోని అసలు విషయం (అపొ. కార్య. 5:42; 10:36; 17:18). కొండమీది

ప్రసంగంలో యేసుచెప్పిన ఆనంద వైఖరులను వారు ప్రకటించారు. యేసు చెప్పిన ఉపమానముల నుండి దేవునిరాజ్యాన్ని దాచబడిన ధనంతోను, వలతోను, మంచి ముత్యముతోను పోల్చి సువార్తను ప్రకటించారు. వారు సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించారు. మరోవిధంగా చెప్పాలంటే, యేసు యొక్క మరణ, సమాధి, పునరుత్థా నాలు క్రొత్తగా జన్మించటానికి ఆధారమని ప్రకటించటం జరిగింది (1 కొరింథీ. 1:23, 15:1-5). యేసుబోధించిన రాజ్య సువార్త నంతటినీ వారు బోధించారని మనకు తెలుసు. ఎందుకంటే, యేసు బోధించిన ప్రకారంగానే ఉండాలని క్రైస్తవులకు వ్రాయబడిన పత్రికల ద్వారా మనం నేర్చు కోగలుగుతున్నాము. "మీలోనున్న క్రీస్తు మహిమ నిరీక్షణయై యున్నాడని" పౌలు చెప్పినప్పుడే దీనినంతటినీ క్లుప్తీకరించినాడు (కొలొస్స.1:27).

సువార్తప్రకటన ద్వారా సమాధానపరచు ఆరంభ పథకంలో మన **రాజు యొక్క** ప్రణాళికను అనుసరించటానికి క్రీస్తు సంఘం ఎక్కువగా జాగ్రత్త వహించాలి. యేసు యొక్క ఆజ్ఞలు మరియు క్రొత్త నిబంధనలో బయలుపరచబడియుండిన సంఘ కార్యక్రమాలు అను వాటిని జాగ్రత్తగా నేర్చుకొనుట ద్వారా మన రాజు అమలు జరుపు చున్న దైవిక పథకం మనకు అర్థమౌతుంది. అపొ. కార్య. 1:8లోను, రోమా. 10:13-15లోను మనం చూచియున్నట్లుగా భౌగోళికపరమైన క్రమం మరియు ప్రకటన పద్ధతి స్పష్టముగా తెలుపబడింది. అయినప్పటికీ, సువార్త ప్రకటనలోని అసలుశక్తి భౌగోళిక పరమైనక్రమంలోగానీ, ప్రకటన పద్ధతిలోగానీ కనుగొనబడదు. అది సందేశం లోనే కనుగొనబడుతుంది. అయితే, సువార్తప్రకటింపబడి, అది నమ్మబడితేనే, అది దేవుని శక్తిగా పనిచేయగలుగుతుంది. "సువార్తనుగూర్చి నేను సిగ్గుపడువాడనుకాను, ఏలయనగా, నమ్ముప్రతి వానికి మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నదని" పౌలు చెప్పాడు (రోమా. 1:16).

అయితే, మనం దేనిని ప్రకటించుదాం? రాజ్యసువార్తసందేశాన్ని అంతటినీ ఏకంగా చెప్పాలంటే బైబిలు గ్రంథమంతటినీ మనం చదవాలి. అయినప్పటికీ, మన ప్రయత్నాన్ని ఆరంభించటానికి సహాయం మనకు లభించునట్లు ఎఫెసులో అపొస్తలు డైన పౌలు బోధించినదానిని గూర్చి ఆలోచన చేద్దాం. పౌలు బోధ నమ్మిన వారు ఎఫెసులో సంఘం అయ్యారు. పౌలు అనుసరించిన సువార్త ప్రకటన క్రమం ప్రకారం మన సందేశానికి సంబంధించిన సంక్షిప్త వివరణ మనకు ఆ బోధలో దొరుకుతుంది. పౌలు తన మూడవ సువార్తయాత్రలో ఎఫెసులో ఉన్న యూదుల సమాజ మందిరంలో ప్రవేశించి మూడునెలలపాటు దేవుని రాజ్యసువార్తను ధైర్యంగా బోధించాడు. మానవుణ్ణి దేవునితో సమాధానపరచటానికి యేసు అనుసరించిన ఆరంభవిధానం ఇదే. ఆ మీదట పౌలు విశ్వాసంగల శిష్యులను ప్రత్యేకపరచుకొని రెండు సంవత్సరాల పాటుగా వారికి బోధించాడు. దయచేసి అపొ. కార్య. 19:1-10 చదవండి. అనేక సంవత్సరముల తరువాత రోములో బంధకములలో ఉండగా ఎఫెసునందున్న సంఘమునకు అతడు పత్రిక వ్రాశాడు (ఎఫెసీ. 6:20). ఎఫెసులో నుండిన కాలమందు వారికి బోధించిన రమ్యమైన ఆశీర్వాదాలు పెక్కింటిని ఆ ఉత్తరం యొక్క పరిచయ వాక్కులలో ప్రస్తావించి అతడు దేవుని రాజ్య సువార్తసందేశాన్ని క్లుప్తీకరించాడని నిస్సందే హంగా చెప్పవచ్చు. ఎఫెసీ.1:1-14 చదవండి. మానవ ప్రమేయ మైన దేవుని రాజ్యాన్ని అర్థం చేసుకోటానికి అతడు ప్రకటించిన దీవెనలు అత్యంత ముఖ్యం. ఎఫెసు పత్రికలో పౌలు వ్రాసిన పరిచయవాక్కులలో ప్రస్తావించ బడిన అంశాలే ఐదవ భాగంలో చెప్ప బడ్డాయి. దేవుని రాజ్యాన్ని గూర్చి పౌలు బోధించినప్పుడు అతడు ఏమి బోధించి ఉంటాడు? అనేప్రశ్నకు ఇవ్వబడే జవాబు కూడా ఇదే.

లోకంలోని ప్రజలు దేవునినుండిదూరమై నశించిపోయారు. వారికి దేవుని రాజ్య సువార్తను ప్రకటించటానికి మనం బోధింపవలసిన ఈ అంశాలను అన్నింటినీ ఇపుడు మొత్తముగాచేసి చూడబోతున్నాం. పరిపక్వత చెందిన వారందరు తప్పిపోవటమో దేవునికి దూరస్తులవటమో జరిగినది (రోమా 5:12). మొదటిగా గ్రహింపవలసిన సంగతి ఏదంటే, యేసు ఒక నూతన పరిధిని స్థాపించి మార్పునొందిన వారిని అందు లోనికి బదిలీ చేస్తున్నారు. అదే "క్రీస్తునందు" అనుస్థితి. "క్రీస్తునందు" ఆత్మ సంబంధ మైన ప్రతీ ఆశీర్వాదం అనుగ్రహింపబడింది. లోకంనందు కాదు. యేసురక్తం ద్వారా విమోచనం పొందిన మనకు ఆయన ప్రభువైఉన్నారు. మనం దేవుని వల్ల పుట్టింపబడిన వారం. అంటే, మన అపరాధాలకు మనకు క్షమాపణ కలిగియున్నందున మనం క్రొత్తగా జన్మించాం. మన పాపాలనిమిత్తమైన బలిగా, యాజకునిగా యేసు తన పాత్రను నిర్వహించినందున దేవుని కృపలో మనం జీవించునట్లు ఇపుడు దేవునికి దత్తపుత్రులమైనాము. దేవునిదృష్టిలో మనం పరిశుద్ధులమును, నిర్దోషులమునై ఉన్నాము. అయితే, అది మన స్వకీయ సామర్థ్యాన్ని బట్టికాక దేవుడు మనకు అను గ్రహించిన నీతి, పరిశుద్ధతను బట్టి మాత్రమే సాధ్యమైంది. ఈ ఆశీర్వాదాలన్నీ మనకు దేవునితో ప్రాథమిక సమాధానాన్ని అనుగ్రహించాయి (1 కొరింథీ. 5:17-19). క్రీస్తునందు పరలోక సంబంధమైన స్థలాల్లో యేసు మనల్ని కూర్చోబెట్టిన విధానం ఇదే. "తనకృపామహిమకు కీర్తికలుగునట్లు తన చిత్తప్రకారమైన దయాసంకల్పం చొప్పున" వరముగా నీయబడిన జీవం మనం కలిగియున్నాము. ఈ సంగతులు ప్రకటింపబడు నట్లుగా భూమి మీద యేసు పాప రహితమైన జీవితాన్ని జీవించటం, సిలువపై మరణిం చటం అనేవి యేసు యొక్క సిద్ధపాటుకోసం సంభవించాయి.

ఏదిఏమైనా, సిలువసందేశంద్వారా దేవునితో మనకు సరియైన సంబంధం అను గ్రహించటం అనుదాని కంటే మనకోసం యేసు సాధింపవలసిన లక్ష్యం అధికమే అవుతుంది. దేవునితో మనం తండ్రీకుమారుల సంబంధాన్ని అనుభవించటానికి వీలుగా ఒక ప్రత్యేకమైన రీతిలో మనల్ని దేవునితో

సమాధానపరచటం యేసుయొక్క లక్ష్యమై వుంది. డబ్ల్యు.ఇ.వైన్ ప్రకారం సమాధానపరచబడుట అనేది మార్పును సూచిస్తుంది. ఒకప్పుడు మనం దేవునికి శతృవులం. అయితే, ఇపుడు దేవునితో సమాధాన పరచబడినవారమై స్నేహపూర్వకమైన సంబంధంలోకి ప్రవేశించాం (రోమా. 5:10). అయినప్పటికీ, శతృత్వం నుండి స్నేహంలోకి మారటం అనుదాని కంటే కూడా సమాధానపరచ బడుట అనేమాట మరింత విశాలమైన అర్థాన్ని ఇస్తుంది. పాపపు బానిసత్వం నుండి దేవుని కుమారుడుగా మార్పుచెందటం ఇందులో ఇమిడి వుంది (గలతీ.4:7). దేవునికృపను బట్టి, మనం సమాధానస్థితిని కలిగివున్నాం. సమాధాన స్థితి అంటే సంబంధంలో మార్పు అని అర్థం. యేసు జరిగించే సమాధానపరచు పరిచర్యవల్ల దేవునితో మనకు తండ్రీకుమారుల సంబంధం లభిస్తుంది. అయితే, ఈ సంబంధం పేరుకు మాత్రం కాక ఆంతర్య పురుషునియందు పరిశు ద్ధత సాధించేదిగా ఉండాలి. మనలను పరిశుద్ధతలోనికి నడిపించే పని పరిశుద్ధాత్మునిది. ఆయన వాక్యం ద్వారాను, మనలో నివసించి సహవాసం ఇవ్వటం ద్వారాను ఆపని జరిగిస్తాడు (1 పేతురు 1:1,2).

పరిశుద్ధాత్ముడు మనలో నివసించటం అనేది మనం క్రీస్తునందు ఉన్నాము అనుదానికి ముద్రగా వుంది. మరియు పరిశుద్ధాత్ముడే మన స్వాస్థ్యమునకు సంచ కరువు. నిత్యజీవాన్ని, దేవుని రాజ్యాన్ని మనం ఎట్లు స్వతంత్రించుకుంటామో ఆరవ భాగంలో చర్చించబడుతుంది. అయినను, స్వాస్థ్యము అనే వాస్తవం దూరస్థుడైనపాపికి ప్రకటింపబడాలి. అన్యజనులకు ప్రకటింప వలసిన తన సందేశ సారాంశాన్ని పౌలు చెప్పినప్పుడు పాపక్షమాపణతో పాటుగా స్వాస్థ్యమునుకూడా ఆయన ప్రస్తావించటం జరిగింది (అపొ. కార్య. 26:16-18). పెంతెకొస్తు దినమందు మారుమనస్సు పొంది బాప్తిస్మం పొందినవారు పరిశుద్ధాత్మను పొందటానికి ఇది యొక కారణమై వుంది (అపొ. కార్య. 2:38). దూరస్థులైన పాపులు వారు విమోచింపడిన సమయమందే పరిశుద్ధాత్మను పొందటానికి వారు సిద్ధపడివుండాలి.

ఎఫెసీయులకు పౌలు ప్రకటించిన సువార్తలో మానవుని కొరకైన దేవుని చిత్తమును గూర్చిన మర్మము బయలుపరచబడింది (ఎఫెసీ. 1:17-19; 3:6). యేసే సత్యం మరియు మనం వెలిగింపబడినవారము. జీవ నియమాన్ని మనకు అన్వయించు కొంటున్నాము. ఆరాధన క్రియలు కొన్నింటిలో దేవుని మహిమను కొనియాడుతున్నాము. దేవునిని ఎరిగేటంతగా ఆయనలో ఆత్మీయంగా పెరుగుతున్నాం. ఈగొప్ప ప్రభుత్వ ములో మనకు పౌరసత్వం ఉంది. అది కాలం సంపూర్ణమైనప్పుడు సంభవించింది. క్రీస్తు శరీరంలో "ఒకరికి ఒకరం ప్రత్యేకంగా అవయవములమై ఉండినందున" మన యొక్క సముచితస్థానం మనకు లభ్యమైంది. క్రీస్తు శరీరమే క్రీస్తుసంఘం. యేసును మనం మన ప్రభువుగా అంగీకరించాము. మనం ఏస్థానిక సంఘంలో సభ్యులుగా ఉన్నామో ఆ స్థానిక సంఘాన్ని పాలించే సంఘపెద్దలను మనకు పై విచారణకర్తలుగా అంగీకరించాలి మరియు యేసును మన ప్రభువుగా అంగీకరించవలెను (ఎఫెసీ. 1:22, 23).

దేవుని రాజ్యం ఐదవ భాగంలో మనం చర్చించిన సందేశం ఇదే. ఎందుకంటే, ఎఫెసులోని క్రైస్తవులు ఈ సందేశాన్ని అర్థంచేసుకోవాలని పౌలు ఆశించటం జరిగింది. వాస్తవానికి అతడు వారికి ఈ సంగతులు ప్రకటించేవుంటాడు. ఎందుకంటే, వివరణ ఇవ్వ కుండానే ఈ సంగతులను ఎఫెసీ పత్రిక ఉపోద్ఘాతంలో ఉదాహరించటం జరిగింది. ఈ అంశాలన్నీ ప్రాముఖ్యమైన అంశాలని దయతో గమనించండి. మనం ఆలోచింపగోరిన ప్రశ్నఇదే. "క్రైస్తవులు కాని ప్రజలకుకూడా పౌలు ప్రకటించిన రాజ్య సువార్త సందేశం ఇదేనా?" మరోవిధంగా చెప్పాలంటే, నిజమైన మారు మనస్సు పొంది, బాప్తిస్మం పొందగలుగుటకు ముందుగా ఒకవ్యక్తి సందేశాన్ని ఎంతవరకు తెలిసికొని ఉండాలి? క్రొత్తగా జన్మించగలుగుటకు ముందుగా దూరస్థుడైన పాపి సువార్తసత్యాన్ని ఎంత వరకూ వినాలి?

మారుమనస్సు అంటే మనస్సు యొక్క మార్పు. ఇది దూరస్థుడైన పాపి తాను బాప్తిస్మం పొందటానికి ముందు కనుబరిచే వైఖరి. అందువలన, దేవుని చిత్తము యొక్క మర్మమును గూర్చిన మంచి అవగాహన వారికి అవసరం అని మనం నిర్ధారించ గలం. మనం ఈ ప్రశ్నను అడగవలసివుంది: "లోకంలోని మనుష్యులు మారుమనస్సు పొందకుండునట్లు తీవ్రమైన హానికలిగించకూడదనుకుంటే పైన మనం చెప్పుకొనిన అంశాలలో ఏ అంశాలను మనం సందేశం నుండి వినాయింపగలం?" ఏదీ లేదు అనేది జవాబు. పైన మనం చెప్పుకొనిన సంగతులన్నీ మానవులకు బోధించి, మానవుల కోసం దేవుడు యేర్పాటు చేసిన సంకల్పాన్ని గూర్చిన మర్మాన్ని పాపులు మారుమనస్సు నందు నూతన నిబంధనను అంగీకరించకముందే (మత్తయి 26:28; హెబ్రీ. 8:10-12) బయలుపరచవలసినవారమై ఉన్నాము. ఈ సందేశం వారికి మారుమనస్సు పుట్టిస్తుంది. అది "పశ్చాత్తాపమును పుట్టించని మారుమనస్సు" కావచ్చు (1 కొరింథీ. 7:10). బాప్తిస్మ మునకు ముందు మారుమనస్సు పొందితేనే నూతన జన్మ సంభవమౌతుందని జ్ఞాపకం చేసుకొందాము. అదేరీతిగా, యేసులేకుండానే నీళ్ల బాప్తిస్మం పొందటం"తడిచినపాపిని" తప్పితే మరిదేనిని ఉత్పత్తి చేయజాలదని కూడా మనం జ్ఞాపకం చేసుకుందాం. వినే వారు ఈ సంగతులన్నీ అర్థం చేసుకొనేటంతగా సిలువను గూర్చిన సువార్తను సువార్తి కుడు బోధించటం అవశ్యకమే. "...దేవుని ఎదుట మారుమనస్సుపొంది మన ప్రభువైన యేసు క్రీస్తునందు విశ్వాసముంచవలెనని యూదులకును, గ్రీసుదేశస్థులకును ఏలాగు సాక్ష్యమిచ్చుచుంటినో ఇదంతయు మీకు తెలియును" అని పౌలు చెప్పినప్పుడు ఎఫెసులో సంఘాన్ని స్థాపించటానికి తాను ఏది బోధించియుండెనో అతడు మనకు విశదపరచుచున్నాడు (అపొ. కార్య. 20:20, 21). ఈ విధంగా వాగ్దానమును బట్టి క్రైస్తవులు అబ్రాహాముకు పిల్లలును వారసులుగా మారడం జరిగింది (గలతీ. 3:26-29).

సువార్త ప్రకటించటంలో సంఘం యొక్క పాత్రను ఇపుడు మనం చదువుకుందాము. ఈనాడు సంఘం యొక్క బాధ్యత ఏమిటి? మనం తెలిసికోవాలంటే అపొస్తలుల కార్యములోను, పత్రికలలోను తెలుపబడిన సంఘం యొక్క పాత్రను అర్థం చేసుకుందాం. యేసు అమలు జరుపు సువార్త ప్రకటనా కార్యక్రమం బాప్తిస్మ మిచ్చు యోహాను దేవుని రాజ్యాన్ని ప్రకటించినప్పుడే ఆరంభమైనదని మనం జ్ఞాపకం చేసుకోవలసివుంది. ఆయన ప్రకటించిన సందేశంలోని మంచివార్త ఏదంటే, మెస్సీయా భూమిమీదికి వచ్చేశారని, ఆయన నాయకత్వంలో దేవునిరాజ్యం సమీపించినదనీ,లోక పాపములను ఆయన తీసివేయుననీ, రాజుగా ప్రధాన యాజకునిగా ఆయన పరిచర్య చేస్తారని ప్రకటించటమే. తండ్రీ -కుమారుల సంబంధం లోనికి భూమిమీది మానవుల నందరినీ నడిపించుట కోసం యేసు అమలుజరిపే ప్రణాళిక కొనసాగింపబడునట్లుగా సంఘాన్ని నడిపించు నిమిత్తం పన్నెండు మంది అపొస్తలులను యేసు సిద్ధంచేశారు. యేసు తిరిగి పరలోకం వెళ్లిన తరువాత తన యొక్క ప్రణాళికలను కొనసాగించటంలో పరిశుద్ధాత్ముడు ఆయనతో సహకరించటం జరిగింది. ఈ పరిస్థితులన్నీ జరిగిన మీదట ఇక సంఘం పని చేయటం కన్పిస్తుంది.

సంఘము యొక్క సువార్త ప్రకటనా కార్యక్రమంలో భౌగోళిక పరమైన ప్రణాళిక ప్రకటనా పద్ధతి మరియు దేవుని రాజ్యసువార్త సందేశం అనేవి ఇమిడి వున్నాయి. నశించినవారికి సువార్తప్రకటించు క్రైస్తవులు సువార్తికులని పిలువబడుదురు. సువార్తి కుడు అను తెలుగుమాట "ఎవాంజిలిస్టెస్" (EVANGELISTES) అను గ్రీకుపదం నుండి తర్జుమా చేయబడింది. మంచిని ప్రకటించు దూతయని దానిభావం. (EV= మంచి; ANGELOS= ఒక దూత) "సువార్తికుని పని చేయుము. నీ పరిచర్యను తుదముట్టించుము" అని పౌలు తిమోతికి హెచ్చరిక చేసాడు (2 తిమోతి. 4:5).ఫిలిప్పు ఒక సువార్తికునిగా గుర్తింపు పొందాడు (అపొ. కార్య. 21:8). మొదటి శతాబ్దంలో సంఘ సభ్యులు కలిగియుండిన కృపా వరములలో ఇది (సువార్తికుని పనిచేయగలగటం) కూడా ఒక వరం (ఎఫెసీ. 4:13). ప్రభువుసంఘంలో సువార్తికులు అనువారు పెద్దలు, పరిచారకులు అనువారికి భిన్నమైనవారు. సువార్తికులను నియమించటానికి ప్రత్యేక మైన పదవులు సంఘానికిలేవు. పెద్దల విషయంలోను, పరిచారకుల విషయంలోను. చెప్పబడినట్లుగా సువార్తికుని అర్హతలకు సంబంధించిన జాబితా ఏది మనకు లేదు. దేవుని రాజ్య సువార్త సందేశాన్ని నశించినవారికి ప్రకటిస్తేనే సువార్తికుడు సువార్తికుడు అనబడతాడు. ఈ వాస్తవాన్ని బట్టి సువార్త ప్రకటించటం అనే ఈ పరిచర్య సంఘంలోని విశ్వాసులైన సభ్యులందరూ చేయటానికి అవకాశం వుందని గ్రహింపవచ్చు. మత్తయి 28:20లో ప్రభువు చెప్పిన మాటలోని "వారికి" అనే పదము సంఘానికి.అదే రీతిగా అపొస్తలులకూ చెందుతుందని ఆది సంఘం అర్థంచేసుకుందని ఈ క్రింది లేఖనములను చదువుటవలన మనకు తెలుస్తుంది.

*ప్రతిదినము దేవాలయములోను ఇంటింటను మానక బోధించుచు, యేసే క్రీస్తని ప్రకటించుచుండిరి*
*అపొ. కార్య. 5:42*

*కాబట్టి చెదరిపోయినవారు సువార్త వాక్యమును ప్రకటించుచు సంచారముచేసిరి. అప్పుడు ఫిలిప్పు సమరయ పట్టణమువరకును వెళ్లి క్రీస్తును వారికి ప్రకటించు చుండెను. అపొ. కార్య. 8:4,5*

*అయితే పౌలును బర్నబాయు అంతియొకయలో నిలిచి, యింకఅనేకులతో కూడ ప్రభువువాక్యము బోధించుచు ప్రకటించుచునుండిరి. అపొ. కార్య. 15:35*

యేసు ద్వారా ఆజ్ఞాపింపబడినట్టి భౌగోళిక పరమైన విధానంలోనే పరిశుద్ధాత్ముడు అపొస్తలులను, సంఘమును నడిపించినాడు. సువార్త ప్రకటనను వారు యెరూష లేములో ఆరంభించి, మిగిలిన ప్రాంతాలలో ప్రకటించారు. "...కాబట్టి యెరూషలేము మొదలు కొని చుట్టుపక్కలనున్న ప్రదేశములందు ఇల్లూరికు ప్రాంతము వరకు క్రీస్తు సువార్తను పూర్ణముగా ప్రకటించియున్నాను నేనైతే మరియొకని పునాదిమీద కట్టకుండు నిమిత్తము... క్రీస్తునామమెరుగని చోట్లను సువార్తను ప్రకటింపవలెనని మిక్కిలి ఆశగల వాడనైయుండి ఆలాగున ప్రకటించితిని" అని పౌలు చెప్పాడు (రోమా. 15:18-21). అంతేకాదు ఆనాడు వారు బహిరంగముగాను, సంత వీధులలోను, ఇంటింటను సువార్త ప్రకటించటం జరిగింది (అపొ. కార్య. 17:17; 20:20). ఆది సంఘం పరిశుద్ధాత్ముని యొక్క ప్రత్యక్షనడిపింపులో **పంపటం మరియు రక్షించటం** అనే విధాన సూత్రాన్ని వినియోగించెనని క్రింది లేఖనములను బట్టి గ్రహించుకోగలం.

*వారు ప్రభువును సేవించుచు ఉపవాసము చేయుచుండగా పరిశుద్ధాత్మ నేను బర్నబాను పౌలును పిలిచిన పనికొరకు వారిని నాకు ప్రత్యేకపరచుడని వారితో చెప్పెను. అంతట వారు ఉపవాసముండి ప్రార్థనచేసి వారిమీద చేతులుంచి వారిని పంపిరి. కాబట్టి వీరు పరిశుద్ధాత్మచేత పంపబడినవారై సెలూకయకు వచ్చి అక్కడనుండి ఓడయెక్కి కుప్రకు వెళ్లిరి. అపొ. కార్య. 13:2-4*

*గనుక సంఘములు విశ్వాసమందు స్థిరపడి, అనుదినము లెక్కకు విస్తరించుచుండెను.*
*అపొ. కార్య. 16:5*

సువార్తికులు పంపబడినా, లేదా వారంతట వారేవెళ్ళినా, లేక ఆత్మచేత కొని పోబడినా, వారు ప్రకటించటం ప్రత్యేకతావులలోనైనా, బహిరంగ స్థలములలోనైనా, చివరికి చెరసాలలోనైనా వారి సందేశం ఎప్పుడూ దేవుని రాజ్యాన్ని గూర్చినదే. ఈక్రింది సమాచారంతో అపొస్తలుల కార్యముల గ్రంథం ముగుస్తుంది.

*పౌలు రెండు సంవత్సరములు పూర్తిగా తన అద్దె యింట కాపురముండి, తన యొద్దకు వచ్చువారినందరిని సన్మానించి ఏ ఆటంకమునులేక పూర్ణధైర్యముతో దేవుని రాజ్యమునుగూర్చి **ప్రకటించుచు**, ప్రభువైన యేసు క్రీస్తును గూర్చిన సంగతులు బోధించుచు ఉండెను.*
*అపొ. కార్య 28:30,31*

అపొస్తలులు మరియు ఆత్మసంబంధమైన వరములు పొందిన సువార్తికులు అనువారు జరిగించిన సువార్త ప్రకటనా కార్యక్రమాన్ని గూర్చి లేఖనాలు తేటగా బయలు పరచుచున్నవి. అయితే, ఈ పాఠంలో మన ఆసక్తి **సంఘం యొక్క పాత్ర** యందే వుంటుంది. మరో విధంగా చెప్పాలంటే, సువార్తికులు కాక మిగిలిన సంఘ సభ్యులంతా సువార్త ప్రకటన విషయంలో ఏమి చేస్తున్నారు? అనే దానిని గూర్చి ఆలోచించుదాం. సువార్త సేవ చేసిన అకుల ప్రిస్కిల్లల వంటి భార్యభర్తల బృందాలు ఈనాటి సంఘంలో ఎంతమంది ఉండాలని ప్రభువు కోరు కుంటున్నారు? దయచేసి, అపొ. కార్య. 18:1,2, 26; రోమా 16:3,4 చదవండి. రోమా 16లో అభినందింప బడినవారిలో "బహుగా ప్రయాసపడినవారి ప్రయాస సువార్తప్రకటనలో ఒక భాగమేనా?

అంతేకాదు "*మీ విశ్వాస యాగములోను, దాని సంబంధమైన సేవలోను నేను పానార్పణ ముగా పోయబడినను నేను ఆనందించి మీ అందరితో కూడా సంతోషింతు నని*" పౌలు ఫిలిప్పీలోని సంఘానికి చెప్పాడు (ఫిలిప్పీ. 2:17). ఆ మీదట అతడు వారితో, "సహోదరులారా! మీరు నన్ను పోలినడుచుకొనుడి" అనికూడా చెప్పాడు (ఫిలిప్పీ. 3:14,17). సంఘములోని ప్రతి సభ్యునికి పౌలు మాదిరై ఉన్నాడా? లేక సంఘంలో ప్రత్యేకమైన కొందరు సభ్యులకే అతడు మాదిరిగా వున్నాడా? కేవలంసంఘమే చేయగలిగినట్టిదియు, సంఘమే చేయవలసినట్టిదియునైన పని అనగా నశించిన వారికి సువార్త ప్రకటించటం అనే ఈ పనిని అంతటినీ ఎవరుచేయాలి? స్థానిక సంఘంలోని సభ్యులలో ఎంతమంది సువార్తికుని పాత్రను ఎన్నుకోవాలి, ఒక్క రేనా? ఇద్దరేనా? అనేకులా? లేక అందరునా? ఈ ప్రశ్నలకు, ఇతరమైన మరికొన్ని ప్రశ్నలకు జవాబు కావాలంటే పత్రికలు మరియు అపొస్తలులు కార్యముల గ్రంథం అను వాటిలోని తెర వెనుక సంగతులను చూడవలసి ఉంటుంది. ఈనాడు దైవప్రేరితమైన సువార్తప్రకటనా కార్యక్రమం మనం కలిగివుండాలంటే మొదటి శతాబ్ధంలో జరిగిన కార్యక్రమాన్ని గూర్చిన "అనుభూతి" మనం పొందవలసి వుంది.

ఆయా ప్రాంతాలకు ప్రయాణంచేస్తూ సువార్త ప్రకటించిన క్రైస్తవులు క్రొత్త నిబంధ నలో మనకు ఎక్కువగానే కన్పిస్తారు. వారు ఒక బృందమువలె పనిచేయగలుగునట్లు సువార్త పనిలో అవసరమైన స్థాయిలో వారు ఒకరితో ఒకరు సహకరించటం జరిగింది. వీరిలో కొందరు రోమా 16:1-15 వచనాలలో ప్రస్తావించబడ్డారు. ఈలాంటి బృందాలు అనేకం సువార్త ప్రకటన జరిగిస్తూ ఉండేవని ఈ క్రింది లేఖనాలు సూచిస్తున్నాయి.

> *స్తెఫను, ఫొర్మూనాతు, అకాయికు అనువారు వచ్చినందున సంతోషించుచున్నాను, మీరు లేని కొరతను వీరు నాకు తీర్చి నా ఆత్మకును మీ ఆత్మకును సుఖము కలుగజేసిరి కనుక అట్టివారిని సన్మానించుడి.* 1 కొరింథీ 16:17,18

> *మీరును నా క్షేమ సమాచారమంతయు తెలిసికొనుటకు ప్రియ సహోదరుడును ప్రభువునందు నమ్మకమైన పరిచారకుడునైన తుకికు నా సంగతులన్నియు మీకు తెలియ జేయును.* ఎఫెసీ. 6:21.

> *మరియు నా సహోదరుడును, జతపనివాడును, నాతోడి యోధుడును మీ దూతయు, నా అవసరమునకు ఉపచరించినవాడునైన ఎపఫ్రొదితును మీ యొద్దకు పంపుట అగత్యమని అనుకొంటిని, అతడు రోగియాయెనని మీరు వింటిరి గనుక అతడు మిమ్ము నందరిని చూడ మిగుల అపేక్షగలవాడై విచారపడుచుండెను.* ఫిలిప్పీ 2:25,26

> *నాయొద్దకు త్వరగా వచ్చుటకు ప్రయత్నము చేయుము. దేమాయిహలోకమును స్నేహించి నన్ను విడిచి థెస్సలొనీకకు వెళ్ళెను, క్రేస్కే గలతీయకును తీతు దల్మతియ కును వెళ్ళిరి లూకా మాత్రమే నాయొద్ద ఉన్నాడు. మార్కును వెంటబెట్టుకొని రమ్ము, అతడు పరిచారము నిమిత్తము నాకు ప్రయోజనకరమైనవాడు. తుకికును ఎఫెసునకు పంపితిని.* 2 తిమోతి. 4:9-11.

మొదటి శతాబ్దంలో సంఘం లేని ప్రాంతాలలో క్రైస్తవులు అనేకులు సంచారం చేస్తూ మనుష్యులను దేవునితో సమాధానపరచటానికి ప్రయత్నంచేస్తూ ఉండేవారని ఈ పైలేఖనాలు మరియు ఇతరములైన మరికొన్ని లేఖనాలు మనకు తెలియ జేస్తు న్నాయి. అయితే, క్రొత్త నిబంధనలో సంఘాన్ని గూర్చిమనం ఏమిచదివినా అది పరిశుద్ధాత్ముడు కృపావరములను అనుగ్రహించిన కాలానికి సంబంధించినదే. అపొస్తలుల శక్తిగానీ, కృపావరముల శక్తిగానీ లేకుండానే మనం సువార్త ప్రకటనా కార్యక్రమాన్ని ఎలాగుచేయగలం? అనేది మనం నిర్ణయింపవలసిన విషయం. మన పఠనానికి కీలకమైన పత్రిక ఒకటివుంది. క్రొత్త నిబంధనలోని పత్రికలన్నింటిలోను అదే చిన్నది. దయచేసి 3వ యోహాను చదవండి. సువార్త ప్రకటనా పథకం సరళమైందే. సువార్త ప్రకటించటానికి కొన్ని సంఘముల నుండి బృందాలు బయలుదేరి వెళ్ళాయి. (5వ వచనం), వారు సంచారం చేస్తూ వుండగా వారిని చేర్చుకొనిన సంఘాలు "వారికి సహాయంచేసారు" (7 వచనం). వారు అక్కడి నుండి వెళ్ళిపోవాలని నిర్ణయించు కొన్నప్పుడు ఈ సహాయం యొక్క ప్రభావం వారికేమీ ఉండదు. ప్రకటించటానికి వారు బయలువెళ్లారు. సంతృప్తి పరచబడవలసిన అవసరాలు వారికి ఉండటం అవశ్యకం. మొదటిశతాబ్దంలో ఓ రెండు విధానలలో ఒక విధానం ద్వారాగానీ, లేదా రెండు విధానాలద్వారాగానీ వారి అవసరాలు తీర్చబడ్డాయి. వాటిలో ఒక విధానం ప్రకటించినవారు స్వహస్తాలతో పనిచేయటం (అపొ. కార్య. 18:3). రెండవది, సంఘం నుండి సువార్తికులు సహాయం పొందటం (1 కొరింథీ. 9:6). దియొత్రెఫే వంటివారు సంఘాలలో ఉండటం సామాన్యమే. అయితే, గాయు మరియు దేమేత్రి వంటివారు కూడా సంఘాలలో ఉంటున్నందులకు దేవునికి స్తోత్రములు!

సంఘంలేని తావులకు సువార్తికుల బృందాలను పంపించటం ఈనాడు సంఘం అవశ్యంగా చేయవలసిన కార్యమైవుంది. మొదటిశ తాబ్దంలో అమలు జరిగిన సువార్త ప్రకటనా కార్యక్రమాన్ని గూర్చి మనం ఇంతకుమునుపు చదువుకున్నాముగదా! ఈనాడు కూడా ప్రపంచంలోని అధికజనాభాకు అదే కార్యక్రమం అవసరమైవుంది. యేసు చెప్పినట్లుగా, "కోతవిస్తారమేగాని

పనివారు కొద్దిగా ఉన్నారు. గనుక తన కోతకు పని వారిని పంపుమని కోత యజమానుని వేడు కొనుడి" (మత్తయి 9:37, 38).

సువార్త ప్రకటన విరివిగా జరగటానికి కావలసిన సావకాశాలన్నీ ఈనాడు మన కున్నాయి. సువార్తప్రకటించటానికి పంపునట్లు ప్రభువుకు అందుబాటులో ఉన్న ఏకైక పనివారు సంఘసభ్యులే. అయిననేమి? సంఘసభ్యులమైన మనం వేలకొలదిగానే ఉన్నాము. మనలో చాలమందిమి "అన్యాయపు సిరి" విషయములో గృహనిర్వాహకుల వలెనే జీవిస్తున్నాము. (లూకా 16:11). తసువార్త ప్రకటన విరివిగా జరగటానికి దోహదం చేసే మరోవిషయమేమంటే, మనం ప్రపంచమంతా రికార్డుస్థాయి వేగంతో ప్రయాణించ గలుగునట్లు ప్రపంచశాంతి మనకుంది. ఇదే పరిస్థితి ఎంతకాలం ఉంటుందో మనకు తెలీదు. గతించిపోయినకాలంలో ఎన్నడూ లేనంతగా మనసొంత సామర్ధ్యాలు, ప్రసార సాధనాలు విరివిగా పెరిగిపోయాయి. అయిన్నటికీ, సువార్త ప్రకటించే సభ్యులు మాత్రం బహుకొద్దిమందే ఉన్నారు. సువార్తపని అని మనం మాట్లాడే ఈ పనిని చేసే వారు క్రీస్తు సంఘాలలో "క్షీణించిపోయే ప్రాణులు" అయిపోతున్నారు.

సంఘ సభ్యులలో ప్రతిఒక్కరూ సువార్తికుని పనిచేయాలని చెప్పే ఆజ్ఞ ఏదీ బైబిలులో లేనట్లుగా మనకు అగుపించవచ్చు. అయితే, సంఘము యొక్క ప్రధాన లక్ష్యం సువార్త ప్రకటించటం అనే దృక్పదాన్ని మనం కలిగివుంటే ఎన్నో లేఖనాలు మనకు మనం అనుకున్న దానికి భిన్నమైన సందేశాన్ని అందిస్తాయి. ఉదాహరణకు, ప్రతీ సభ్యుడు సువార్తికుడు కావాలనీ లేదా కనీసం సువార్తికుల బృందాలకు బహుగా సహాయం చేయాలని మనం నమ్మి, సువార్త బృందం సువార్తప్రకటన జరిగించకపోవటం పాపమని అంగీకరిస్తే, ఈ క్రింది లేఖనాలు సువార్త ప్రకటించాలని ప్రతీ సభ్యునికి ఆజ్ఞాపిస్తాయి.

*మొదటి దినమునుండి ఇది వరకు సువార్త విషయములో మీరు నాతో పాలివారై యుండుట చూచి, మీలో ఈ సత్ క్రియనారంభించినవాడు యేసుక్రీస్తు దినము వరకు దానిని కొనసాగించునని రూఢిగా నమ్ముచున్నాను. గనుక మీ అందరి నిమిత్తము నేను చేయు ప్రతి ప్రార్థనలో ఎల్లప్పుడును సంతోషముతో ప్రార్థనచేయుచు, నేను మిమ్మును జ్ఞాపకము చేసికొనినప్పుడెల్లను నా దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించు చున్నాను.* ఫిలిప్పీ. 1:3-6.

*ఏలయనగా మీరు నాయందు చూచినట్టియు, నాయందున్నదని మీరిప్పుడు వినుచున్న ట్టియు పోరాటము మీకును కలిగి యున్నందున క్రీస్తునందు విశ్వాసముంచుట మాత్రమే గాక ఆయన పక్షమున శ్రమపడుటయు ఆయన పక్షమున మీకు అనుగ్రహింపబడెను.* ఫిలిప్పీ. 1:29,30.

*కాగా నా ప్రియులారా, మీరెల్లప్పుడును విధేయులైయున్న ప్రకారము, నాయెదుట ఉన్నప్పుడు మాత్రమేగాక మరి యెక్కువగా నేను మీతో లేని యీ కాలమందును, భయముతోను వణకుతోను మీ సొంతరక్షణను కొనసాగించుకొనుడి ఎందుకనగా మీరు ఇచ్ఛయించుటకును కార్యసిద్ధి కలుగజేసికొనుటకును, తనదయాసంకల్పము నెరవేరుటకై మీలో కార్యసిద్ధికలుగజేయువాడు దేవుడే.* ఫిలిప్పీ. 2:12,13

*మరియు మీరు నావలన ఏవి నేర్చుకొని అంగీకరించితిరో, నాయందున్నట్టుగా ఏవి వింటిరో ఏవి చూచితిరో, అట్టివాటిని చేయుడి అప్పుడు సమాధానకర్తయగు దేవుడు మీకు తోడైయుండును.* ఫిలిప్పీ. 4:9

సమర్ధవంతమైనరీతిలో సువార్త ప్రకటించే కార్యక్రమం సంఘానికి లేకపోతే ఆసంఘం వస్తువులను తయారుచేసి వాటిని ఎగుమతిచేయని కంపెనీతో సమానం, ఇది మనం నమ్మినప్పుడు సువార్త ప్రకటించాలనిచెప్పే ఆజ్ఞలు అనేకం మనకు అగు పిస్తాయి. బహుశా, అవసరమైన రీతిలో ఊహించటం ద్వారా అవి మనకు అగుపిస్తాయి ప్రతీసభ్యుడు ప్రపంచసువార్తిక బృందంలో ఒక భాగం కావటం అసంభవం అనేది స్పష్టం. అయిననేమి? మనలో ప్రతీ ఒక్కరం ఒక బృందానికి సహకారులం కాగలం లేదా, సంఘములేని తావులలోగానీ, సంఘము బలముగాలేని పరిస్థితులలో గానీ ఒక సువార్తి కునికి సహాయం చేయవచ్చును. అవశ్యంగా, సువార్త ప్రకటించాలంటే మన సొంత ప్రాంతంలోనే నశించినవారు ఎప్పుడూ ఉంటారు. ఈ క్రింది సలహాను అపొస్తలుడైన పేతురు మనకోసం అనుగ్రహిస్తున్నాడు. *"నిర్మలమైన మనస్సాక్షి కలిగినవారై మీలో ఉన్న నిరీక్షణను గూర్చి మిమ్మును హేతువు అడుగు ప్రతివానికిని సాత్వికముతోను భయముతోను సమాధానము చెప్పుటకు ఎల్లప్పుడు సిద్ధముగా ఉండి, మీ హృదయ ములయందు క్రీస్తును ప్రభువుగా ప్రతిష్ఠించుడి" (1 పేతురు 3:15,16).*

అపవాది తంత్రాలను ఎదిరించి మనలను మనం కాపాడుకోటానికి ప్రతీ క్రైస్తవుడు సర్వాంగకవచం ధరించాలని మనం నమ్మితే, ఆత్మఖడ్గాన్ని ఉపయోగించటం ఎట్లో నేర్చుకోటానికి మనం సంశయింపము (ఎఫెసీ. 6:17). శత్రువును సంహరించటానికీ ఆలాగే శత్రువుబారినుండి మనల్ని మనం కాపాడుకోటానికీ మనం ఇష్టపడవలసిన అవసరం ఉంది. నిజమే క్రైస్తవులమైన మనమంతా ఎప్పుడో ఒకప్పుడు శిశుదశలోను, బాల్యదశలోను ఉంటాం. అయితే, చాలా కాలం ఈ దశలలోనే మనం ఉండిపో కూడదు (1 పేతురు 2:1-3; 1 కొరింథీ.14:20; హెబ్రీ.5:12-14). లౌకికరంగాలలో ప్రజలు తరుచుగా తమ ప్రస్తుత అంతస్థుకు మించిన లక్ష్యాలను ఏర్పరచుకొని, కొన్ని కార్యాలు సాధింప గలుగునట్లుగా కఠినమైన, దీర్ఘకాలికమైన తర్ఫీదులోనికి ప్రవేశిస్తారు. ప్రజలంతా సువార్త వినేంతవరకూ ప్రభువుకు ఆనందం లేదని క్రైస్తవులమైన మనం నమ్మి, సువార్త ప్రకటింపవలసిన బాధ్యత సంఘానికి వుందని మనం అర్థం చేసుకొన్నప్పుడు సువార్త పని కోసం మనలను మనం సిద్ధపరచుకొంటాం (2 తిమోతి 2:2). ఒకవేళ మనం విద్యావంతులంకాకపోతే చదవటం నేర్చుకొని, ఆమీదట సువార్త ప్రకటించటానికి వెళ్లాలి. మన ప్రభువును సంతోషపరచటం కంటే మించిన సంగతి మరేముంది? దైవ భక్తి అంటే అదే గదా!

క్రీస్తునందున్న మన కోసం ఆత్మ సంబంధమైన ఆశీర్వాదములన్నీ ఆరోగ్య వంతమైన మానసిక వాతావరణాన్ని లేక క్రైస్తవుని సర్వాంగ కవచాన్ని రూపొందించటానికి ఎట్లు పనిచేస్తాయో ఈ పాఠ్య క్రమంలో మనం చూచియుంటిమి. మనం కలిగివున్న మానసిక వాతావరణమే ఆత్మీయ

పెరుగుదలలో మనకు సహాయం చేస్తుంది. ఆత్మీయంగా పెరుగునప్పుడు మనం ఆత్మఫలం కలిగివుంటాం. "అయితే, ఆత్మఫల మేమనగా, ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచి తనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము. ఇట్టివాటికి విరోధమైన నియమమేదియు లేదు" అని పౌలు చెప్పాడు (గలతీ. 5:22, 23). ఆత్మఫలంలోని ఒక్క అంగం మాత్రమే విశదీకరింపబడితే చాలు ఆత్మచేత నడిపింపబడుచున్న మనం నశించిన వారికి సువార్త ప్రకటించాలని ఒప్పుకుంటాము. ఈక్రింది లేఖనంలో ప్రేమ అనేది ఇతరమైన అనేక అలోచనలకు సంబంధించివుంటుంది. ఆప్రేమను మనం ఇపుడు సువార్తకు కలుపుదాము.

*ప్రేమ పొరుగువానికి కీడుచేయదు గనుక ప్రేమకలిగి యుండుట ధర్మశాస్త్రమును నెరవేర్చుటయే. మరియు మీరు కాలమునెరిగి, నిద్రమేలుకొను వేళయైనదని తెలిసికొని, ఆలాగు చేయుడి. మనము విశ్వాసులమైనప్పటికంటె ఇప్పుడు, రక్షణ మనకు మరి సమీపముగా ఉన్నది. రాత్రి చాల గడచి పగలు సమీపముగా ఉన్నది గనుక మనము అంధకార క్రియలను విసర్జించి, తేజసంబంధమైన యుద్ధోపకరణములు ధరించు కొందము. రోమా. 13:10-12*

మనం మన పొరుగువారికి కీడు చేయకుండా ఉండి మానవుని కొరకైన దేవుని సంకల్పాన్ని వారికి చెప్పకపోవటం జరుగుతుందంటారా? సువార్తప్రకటన చేయనీ యకుండా యేసును ఆపటం అసంభవం. ఎందుకంటే, ఆయన ప్రేమాస్వరూపి, అగాపే, యేసుక్రీస్తును మనం ధరించుకోవటం ఆరంభిస్తే సువార్తప్రకటించాలనే కోరిక మనకు కలుగుతుంది. ఎందుకంటే, నరకబాధలను అనుభవింపవలసినవారిపట్ల మన కుండిన ప్రేమ ఆకోరికను పుట్టిస్తుంది. మనం సువార్త ప్రకటింపకపోతే వారి గతి నరకమే గదా! సభ్యులను రక్షించే సభ్యులనుగూర్చి మాత్రమే యూదా ఈక్రింది లేఖనంలో మాట్లాడటం జరిగింది. అయిననేమి? ఎవరికైనా సూత్రం ఒక్కటే ప్రేమించే వారు ఎవరైనా సువార్తపని చేస్తారు.

*ప్రియులారా, మీరు విశ్వసించు అతిపరిశుద్ధమైనదానిమీద మిమ్మును మీరు కట్టు కొనుచు, పరిశుద్ధాత్మలో ప్రార్థనచేయుచు, నిత్యజీవార్థమైన మన ప్రభువగు యేసుక్రీస్తు కనికరముకొరకు కనిపెట్టుచు, దేవునిప్రేమలో నిలుచునట్లు కాచుకొని యుండుడి. సందేహపడువారిమీద కనికరము చూపుడి. అగ్నిలోనుండి లాగినట్లు కొందరిని రక్షించుడి, శరీర సంబంధమైనవారి అపవిత్రప్రవర్తనకు ఏ మాత్రము నొప్పుకొనక దానిని అసహ్యించుకొనుచు భయముతో కొందరిని కరుణించుడి. యూదా. 20-23*

కొండమీది ప్రసంగంలో యేసు వర్ణించిన వ్యక్తులుగా మనం వృద్ధిచెందాలంటే క్రీస్తునందున్న ఆత్మీయ ఆశీర్వాదములన్నీ క్రైస్తవులమైన మనకు అవసరం. ఈ ఆశీర్వాదా లన్నీ మనకు సహాయం చేసినప్పటికీ, వీటికి మించినది మరొకటి మనకు అవసరమౌ తుంది. నీతియందు పెరుగుటకు మనం నీతిని జరిగింపవలసినవారమై ఉన్నాము (1 యోహాను 3:7). బలవర్ధకమైన ప్రవర్తన అంటే ఇతరులకు సేవ చేయటం అనేది సహాయం పొందినవారి కంటే కూడా సహాయం చేసిన వారికి ఎక్కువగా మేలు చేస్తుంది. క్రైస్తవులమైన మనం స్వార్ధరహితమైన ఉన్నత లక్ష్యాలు వృద్ధిచేసుకోవాలి. "పుచ్చుకొనుట కంటే ఇచ్చుట ధన్యము" అనే జీవనియమంవలెనే ప్రేమ అనేది కూడా ఒక జీవ నియమం. ప్రేమ పూరిత ప్రవర్తనను ఆచరణలో పెట్టకూండా మన వ్యక్తిత్వంలో ఒక భాగముగా ప్రేమను మనం వృద్ధిచేసుకొనజాలమని మనకు తెలుసు. ప్రేమను ఆచరణలో పెట్టడమే సువార్తను ప్రకటించటం. ప్రేమకలిగినప్పటికీ దానిని ఆచరణలో పెట్టకపోతే దానిని కోల్పోతాము.

అత్యంతశ్రేష్ఠమైన సవాలు దేవునికుమారులకు ఉంది. అదేమంటే, యేసు ప్రేమించినట్టుగా మనం కూడ ప్రేమించటం. మనం ఆయనకు శతృవులముగా ఉండినప్పుడు ఆయన మనలను ప్రేమించాడు (రోమా. 5:8-10). ఇవ్విధమైన ప్రేమను వృద్ధిచేయగలిగే ఏకైక మనస్సు సువార్తప్రకటించాలనే మనస్సే తప్ప మరేది కాదు. అనేకసందర్భాలలో మనం సువార్త ప్రకటిస్తున్న వారు మన శతృవులై ఉండటం జరుగుతుంది. వారిని ప్రేమించటం సాధ్యం కాకపోతే మన శతృవులను ప్రేమించటం ఎట్లో మనం నేర్చుకోలేము. సువార్తప్రకటన అనేది ప్రేమను ఆచరణలో పెట్టటం అనుదానికి సంబంధించిన సంపూర్ణ అభ్యాసం కాబట్టి, సువార్తప్రకటన మన వ్యక్తిగత ఆత్మీయపెరుగుదలకు సహాయం చేస్తుంది. దేవునికుమారులగునట్లు మన శతృవులను కూడా ప్రేమించాలని యేసు మనకు ఆజ్ఞాపించుచున్నారు.

*నేను మీతో చెప్పునదేమనగా, మీరు పరలోకమందున్న మీ తండ్రికి కుమారులై యుండు నట్లు మీ శత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించు వారికొరకు ప్రార్థన చేయుడి.మత్తయి 5:44, 45*

సాతానును జయించాలంటే క్రైస్తవులమైన మనమంతా వాడితో పోరాడాలి. దేవుని పిల్లలు తిరిగి దేవుని దగ్గరకి రావాలంటే యేసుతో మనం పనిచేయాలి. తామిచ్చిన సాక్ష్యమును బట్టియు, మరో రెండు కారణములను బట్టియు మొదటిశతాబ్దంలోని క్రైస్తవులు సాతానును జయించారని అపొస్తలుడైన యోహాను చెప్పుచున్నాడు. రెంటిలో ఒకటి క్రీస్తురక్తమునందలి విశ్వాసం; రెండవది, మరణం వరకూ తమ ప్రాణాలను ప్రేమించకపోవటం.

*వారు గొఱ్ఱెపిల్ల రక్తమునుబట్టియు, తామిచ్చిన సాక్ష్యమునుబట్టియు వానిని జయించి యున్నారు గాని, మరణము వరకు తమ ప్రాణములను ప్రేమించిన వారు కారు. ప్రకటన 12:11*

మనం అడుగగోరిన ఆఖరి ప్రశ్న. సువార్తప్రకటనను వ్యక్తిగతముగా నేను ఎంత వరకూ చేయాలి? నిశ్చయంగా, ఇది వ్యక్తిగతమైన ప్రశ్న. దీనిజవాబు వ్యక్తికీ వ్యక్తికీ మధ్య మారుతూ వుంటుంది. ఒక్క విషయంమాత్రం నిశ్చయం. క్రైస్తవులమైన మనం ఆరోగ్యవంతమైన మంచి యుగాంతదృక్పదం కలిగివుండాలి. అంటే, మనం సహాయం పొందుతున్నా, పొందక పోయినా, దీర్ఘకాలికమైన సువార్తప్రకటనా కార్యక్రమంలో నిమగ్నం కావటానికి పూర్వం భౌతిక మరణం మరియు దానికి తరువాతి సంగతులు అనువాటికి సంబంధించిన ఆరోగ్యవంతమైన మంచి దృక్పథం మనకు అవసరం. మృతుల పునరుత్థానమునందు పౌలుకు గల బలమైన విశ్వాసమునుబట్టి అతడు తనను తాను పూర్తిగా అర్పించుకోగలిగివుండవచ్చు (ఫిలిప్పీ. 1:21-24). అతడు "మంటి ఘటముల" దృక్పథంతో సౌఖ్యంగా ఉన్నాడు (2 కొరింథీ. 4:7-14).

ఈపఠనంలో తరువాతి భాగమునకు పెట్టబడినపేరు, బైబిలు ప్రకారమైన యుగాంతశాస్త్రం. సువార్తప్రకటనకు మనలను మనం సమర్పించుకోటానికి అది మనకు తప్పక సహాయం చేస్తుంది.

## చర్చ కోసం ప్రశ్నలు

1. గొప్ప ఆజ్ఞను యేసు ఎందుకిచ్చారు?
2. యేసు యొక్క భౌగోళిక ప్రణాళిక ఏది?
3. లేఖనాలలో యేసు యొక్క పద్ధతి సూత్రాన్ని మనం ఎచ్చట కనుగొనగలం?
4. సువార్త ప్రకటనలో వినియోగించవలసిన సందేశం ఏది?
5. యేసు యొక్క సమాధానపరుచు ప్రణాళికలోని నాలుగు భాగాలు ఏవి?
6. క్రొత్త నిబంధనలో దేవుని రాజ్యమును ప్రకటించటాన్ని తెలియజేసే వచనాలను వరుసక్రమముగా వ్రాయండి.
7. దేవుని రాజ్యానికి సంబంధించి యేసు మరియు బాప్తిస్మమిచ్చుయోహానులు అనువారి సందేశానికీ అపొస్తలుల సందేశమునకు మధ్యగల వ్యత్యాసం ఏమి?
8. సంఘంద్వారా ప్రకటింపబడిన సందేశంలో యేసుచెప్పిన ఉపమానాలు మరియు కొండమీది ప్రసంగం అనువాటిలో భావాలు ఇమిడి వున్నాయని మనం ఎట్లు తెలిసికోగలం?
9. ఎఫెసుసంఘానికి పౌలు వ్రాసిన పరిచయ వాక్కులలోని అంశాలను వరుసగా వ్రాయండి.
10. పైనచెప్పిన అంశాల జాబితా, దేవుని రాజ్య సువార్త యొక్క సంక్షిప్తవివరణ అని మనమేల నమ్ముదుము? నశించిపోయినవారికి ఇదంతా బోధించాలని మనమేల నమ్మాలి?
11. యేసు యొక్క సమాధానపరిచర్యలోని విశిష్ఠిత ఏది.
12. సువార్తికుడు ఎవరు?
13. మత్తయి 28:19, 20లో యేసు ఇచ్చిన ఆజ్ఞలో ప్రస్తావించబడిన “వారికి” అనే మాటను సంఘం ఎట్లు అర్థం చేసుకుంది?
14. వ్యక్తిగత సువార్తప్రకటన అనే మన బాధ్యతను గూర్చి మనమెట్లు నేర్చుకోగలం?
15. మొదటి శతాబ్దంలో అమలులో ఉన్న సువార్తప్రకటనా కార్యక్రమాన్ని గూర్చి నీ అవగాహన ఇమ్ము. ఇది నేడు మనకు అన్వయించునా?
16. నేటి సంఘం మంచి సువార్తీకరణ చేయకలిగియుండాలి ఎందుకు?
17. సంఘం యొక్క ముఖ్య పనిని గూర్చి మనలో వేరువేరు వైఖరులు ఉన్నాయి. సువార్త ప్రకటనలకు సంబంధించిన మన అవగాహనను ఇవి ఎట్లు మార్పు చేస్తాయి?
18. సువార్త ప్రకటన చేయటానికి మనం ఇంకా పెరగలేదని నిర్ణయం చేసుకొంటే మనం ఏమిచేయాలి.
19. ఆత్మ ఫలానికీ, సువార్త ప్రకటనకీ మధ్య గల సంబంధమేమి?
20. మన ఆత్మీయపెరుగుదలకు సువార్త ప్రకటన ఎట్లు సహకరిస్తుంది?